# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 29-07-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమిష్టిగా కృషి చేస్తే వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించవచ్చుని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు.

**2.** గోదావరి వరద బాధితులని ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందని ఆంధ్రప్రదేశ్ కార్మిక శాఖా మంత్రి వి.సుభాష్ వెల్లడించారు.

**3.** రైతుల పంట సాగుకు అవసరమైన చర్యలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకుంటోందని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు.

**4.** తెలంగాణ సంస్కృతి, వారసత్వ పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

**5.** ఈరోజు అంతర్జాతీయ పులుల దినోత్సవం నిర్వహిస్తున్నారు.

**6.** ప్రముఖకవి, జ్ఞానపీఠ్ పురస్కార గ్రహీత సింగిరెడ్డి నారాయణరెడ్డి జయంతి ఈరోజు.

==========================

ప్రజా సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమిష్టిగా కృషి చేస్తే వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించవచ్చుని ప్రధానమంత్రి నరేంద్రమోదీ తెలిపారు. నిన్న ఢిల్లీలో బిజెపి పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులతో ప్రధానమంత్రి సమావేశమైయ్యారు. ఈ సమావేశంలో బిజెపి అధ్యక్షులు జెపి నడ్డా, కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజనాథ్ సింగ్ సహా 13 బిజెపి పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరయ్యారు. ఈ సమావేశ వివరాలను బిజెపి సుపరిపాలన విభాగం సమన్వయకర్త వినయ్ సహస్ర బుద్దే పాత్రికేయులకు వివరించారు. వికసిత్ భారత్ లక్ష్యంలో వారసత్వ సంపద అభివృద్ధితో పాటూ, వారసత్వ సంపదను సృష్టించడం కూడా ప్రత్యేక ప్రాధాన్యత కలిగి ఉందని, ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని ప్రధానమంత్రి సూచించారని వినయ్ సహస్ర బుద్దే తెలిపారు.

-------------------------

గోదావరి వరద బాధితులని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందని రాష్ట్ర కార్మిక శాఖా మంత్రి వి.సుభాష్ అన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కె గంగవరం మండల పరిధిలోని కోటిపల్లి గ్రామంలో ముంపు ప్రభావిత ప్రాంతాలను, మత్స్యకార కాలనీలను మంత్రులు అచ్చేన్నాయుడు, వి. అనితలతో కలిసి మంత్రి పరిశీలించారు. వరద సహాయక చర్యలలో భాగంగా ఏర్పాటుచేసిన ఉచిత పశు వైద్య

శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, గోదావరి ఏటిగట్ల పటిష్టతపై శాశ్వత ప్రాతిపదికన చర్యలు చేపడతామని మంత్రి తెలుపుతూ,

వాయిస్ (27 సెకన్లు)

---------------------------

రైతుల పంట సాగుకు అవసరమైన అన్ని చర్యలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకుంటోందని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారధి తెలిపారు. ఏలూరు జిల్లాలోని చాట్రాయి మండలం మంకొల్లు గ్రామంలో నిర్మించిన తమ్మిలేరు జలాశయం నుండి నీటిని మంత్రి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతాంగ సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, సుమారు 4 వేల ఎకరాల సాగుకు 40 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశామని తెలిపారు. కూటమి ప్రభుత్వం బాధ్యతలు చేపట్టిన వెంటనే సాగునీటి ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి సారించిందని, పట్టిసీమ ఎత్తిపోతల పథకం ద్వారా కృష్ణా డెల్టాకు సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకున్నామని చెప్పారు. రైతులకు సాగునీటి అవసరాలను బట్టి అధికారులు పర్యవేక్షించి పంటలకు నీటిని విడుదల చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

---------------------------

తెలంగాణ సంస్కృతి, వారసత్వ పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో రాష్ట్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో కుతుబ్‌షాహీ హెరిటేజ్ పార్క్‌లో అగాఖాన్ ట్రస్ట్ ఫర్ కల్చర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా కుతుబ్‌షాహీ సమాధి ప్రాంతాలను మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి ముఖ్యమంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాతవాహనులు, కాకతీయులు, కుతుబ్‌షాహీలు ఈ ప్రాంతాన్ని పాలించారని, ప్రతి ఒక్కరూ వారి ప్రత్యేకమైన సాంస్కృతిక ముద్రను వేశారని చెప్పారు. చార్మినార్, గోల్కొండ కోట, కుతుబ్‌షాహీ సమాధులు, వేయి స్తంభాల గుడి, రామప్ప దేవాలయం, అలంపూర్ దేవాలయాలు వంటి వాస్తు శిల్పాలకు తెలంగాణ నిలయంగా ఉందన్నారు. యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయం తెలంగాణకు గర్వకారణమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

---------------------------

పులుల సంతతిని పరిరక్షించి, వాటిని పెంపొందించే ఉద్దేశ్యంతో ఈరోజు అంతర్జాతీయ పులుల దినోత్సవం నిర్వహిస్తున్నారు. పులులు... వాటి సహజ ఆవాసాల పరిరక్షణ, పులుల సంఖ్యను పెంచడం ఈ కార్యక్రమ నిర్వహణలోని ముఖ్యోద్దేశం, పర్యావరణ వ్యవస్థ సమతూకంగా ఉండాలంటే మానవాళితో పాటు జంతువుల ఆవాసానికి కూడా అత్యంత ప్రాధాన్యత ఇవ్వవలసిన అవసరం ఉంది.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో అమలుచేస్తున్న ప్రభుత్వ పథకాలను స్ఫూర్తి ప్రదాతల పేర్లతో అమలు చేయటం హర్షణీయమని ఉపముఖ్యమంత్రి కె. పవన్ కల్యాణ్ అన్నారు. సంక్షేమ పథకాలకు సమాజ సేవకులు, శాస్త్రవేత్తలు, విద్యావేత్తల పేర్లు పెట్టడం సముచితమన్నారు. మధ్యాహ్న భోజన పథకానికి డొక్కా సీతమ్మ పేరును స్వాగతిస్తున్నామన్నారు. విద్యార్థులకిచ్చే ప్రతిభా పురస్కారాలకు అబ్దుల్ కలాం పేరు, బడిపిల్లల సామగ్రి పథకానికి సర్వేపల్లి రాధాకృష్ణన్ పేరు పెట్టినందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి సామాజిక మాధ్యమం వేదికగా ధన్యవాదాలు తెలిపారు.

---

తెలంగాణలోని నీటి ప్రాజెక్టులను ప్రాధాన్యతా క్రమంలో త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లో నీటిపారుదలశాఖ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, ప్రతి ఏడాది ఆరు నుంచి ఆరున్నర లక్షల ఎకరాల కొత్త ఆయకట్టు కోసం కృషి చేయాలని నిర్ణయించామని ప్రతి 15 రోజులకు ఒకసారి పనుల పురోగతిపై సమీక్షిస్తామని చెప్పారు. ఈ ఆర్థిక సంవత్సరం నీటిపారుదలశాఖలో 10 వేల 820 కోట్ల రూపాయల మేర పనులకు ఆర్థికశాఖ అనుమతి ఇచ్చిందని మంత్రి తెలిపారు.

---

ప్రముఖకవి, జ్ఞానపీఠ్ పురస్కార గ్రహీత సింగిరెడ్డి నారాయణరెడ్డి జయంతి ఈరోజు. తెలుగు సాహిత్యానికి ఎనలేని సేవలుచేసిన ఆయన 1931 జులై 29వ తేదీన తెలంగాణలోని కరీంనగర్ జిల్లా హనుమాజీపేటలో జన్మించారు. తెలుగు చలన చిత్రాల్లోకూడా ఎన్నో పాటలను రచించిన ఆయనకు సాహిత్య అకాడమీ పురస్కారం, పద్మశ్రీ. కళాప్రపూర్ణ, పద్మభూషణ్ పురస్కారాలతోపాటు విశ్వంభర కావ్యానికి ప్రతిష్టాత్మకమైన జ్ఞానపీఠ్ పురస్కారం లభించింది.

---

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను దేశ ప్రజలతో పంచుకునే మన్ కీ బాత్ కార్యక్రమం 112వ సంచిక నిన్న ఆకాశవాణి ద్వారా ప్రసారమైంది. ఈ కార్యక్రమంలో ప్రధానమంత్రి వివిధ అంశాలపై సంభాషించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఒలింపిక్స్‌తో పాటు, అంతర్జాతీయ గణిత ఒలింపియాడ్ గురించి ప్రస్తావించారు. ఏక్ పేడ్ మా కే నామ్ కార్యక్రమానికి దేశ వ్యాప్తంగా విస్తృత స్పందన లభిస్తోందని హర్షం వ్యక్తంచేశారు. ప్రజా కళను ప్రాచుర్యంలోకి తెచ్చేందుకు, ప్రాజెక్ట్ పరీ పబ్లిక్ ఆర్ట్ ఆఫ్ ఇండియా ఒక ప్రధాన మాధ్యమంగా దోహదపడుతుందన్నారు. ఈ ఏడాది కూడా త్రివర్ణ పతాకంతో కూడిన సెల్ఫీని హర్ ఘర్ తిరంగా డాట్ కామ్ లో అప్‌లోడ్ చేయాలని తెలిపారు. ఇటువంటి విశేషాలతో మన్ కీ బాత్ 112వ సంచిక పై ఆకాశవాణి విశాఖపట్నం ప్రాంతీయ వార్తా విభాగం రూపొందించిన ప్రత్యేక కార్యక్రమం ఈ రోజు ఉదయం 10 గంటలకు ప్రసారమవుతుంది.

---

చికిత్స కోసం ఆసుపత్రికి వచ్చే వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. నిన్న ఖమ్మంలోని సర్వజన ఆసుపత్రిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ ఆసుపత్రిలో పడకల సంఖ్య పెంచుతామని.. వైద్యులు, సిబ్బంది ఖాళీలను భర్తీ చేస్తామని తెలిపారు. ఆసుపత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా ఆయా అంశాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌ను ఆదేశించారు.

---

పారిస్ ఒలింపిక్స్ 2024 లో భారత్ తొలి పతాకాన్ని సాధించింది. మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ షూటింగ్‌లో మను బాకర్ కాంస్య పతకం సాధించింది. దీంతో ఒలింపిక్స్ షూటింగ్లో పతకం సాధించిన తొలి

భారత మహిళగా మను బాకర్ నిలిచింది. భారత్‌కు ఒలింపిక్స్‌లో తొలి పథకాన్ని అందించిన మనూ బాకర్‌కు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు. మరోవైపు మహిళల 10 మీటర్ల క్వాలిఫయింగ్ రౌండ్లో రమితా జిందాల్ 631.5 స్కోరుతో ఐదో స్థానంలో నిలిచి ఫైనల్లోకి ప్రవేశించింది. రోయింగ్ విభాగంలో భారత అథ్లెట్ బల్రాజ్ పన్వార్ రెండో రౌండ్లో అద్భుత ప్రతిభ కనబరిచి క్వార్టర్ ఫైనల్ కు చేరాడు.

---------------------------

కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన ఉమ్మడి ప్రవేశ పరీక్ష సీయూఈటీ-యూజీ 2024 ఫలితాలను జాతీయ పరీక్ష సంస్థ- ఎన్‌టీఏ విడుదల చేసింది. స్కోర్ కార్డు కోసం అధికారిక వెబ్‌సైట్‌ను విక్షించాలని అధికారులు తెలిపారు.

=======================